క్లుప్తంగా

గుంతకల్లులో భారీ వర్షం



వర్షం పడుతున్న దృశ్యం

గుంతకల్లు: రోహిణ కార్తె ప్రభావంతో శుక్రవారం ఉదయం వేడి తీవ్రతతో అల్లాడిన ప్రజానీకం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో కాస్త ఊరట నిచ్చింది. మధ్యాహ్నం 2.00 గంటలకు ఒక్కసారిగా నల్లటి మేఘాలతో గాలులతో కూడిన వర్షం ప్రారంభమై సుమారు గంటకు పైగా ఏకధాటిగా కురిసింది. డ్రైనేజీలు, లోతట్టు ప్రాంతాలు జలమాయమయ్యాయి. వ్యవసాయ పనులకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉంటుదని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పామిడిలో మోస్తరు వాన



మడుగును తలపిస్తున్న గుత్తి- బీసీసీ రోడ్డు

పామిడి: పామిడిలో శుక్రవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఈ వర్షానికి లోతట్టు ప్రాంతాలైన మదీనా కాలనీ తదితర వీధులు జలమయ్యాయి. డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లాయి. రోడ్ల గుంతలు వర్షపునీటితో నిండాయి. మరిముఖ్యంగా గుత్తి బీసీసీరోడ్డు మడుగును తలపించింది. దీంతో వాహనచోదకులు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులకు గురైయ్యారు. ఈ వర్షంతో వాతావరణం చల్లబడింది. దీంతో ఒక్కసారిగా ఉక్కపోతతో అల్లాడుతున్న జనంకు ఉపశమనం కలిగించింది. ఈవర్షంపై రైతన్నలు హర్షం వ్యక్తంచేశారు.

ప్రమాదకరంగా మారిన రహదారి



పుట్లూరు-తాడిపత్రి రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

పుట్లూరు: పుట్లూరు-తాడిపత్రి రోడ్డు వర్షపు నీటితో ప్రమాదకరంగా మారింది. టిప్పర్ల ద్వారా మట్టిని రోడ్డు నిర్మాణం కోసం గత కొన్ని నెలలుగా తరలిస్తున్నారు. దీంతో రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. ఇదే సమయంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై గుంతలు నీటితో నిండి ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

విత్తన కందులకు రిజిస్ట్రేషన్


శింగనమల: మండలంలోని ఆర్బీకేల్లో ఈ నెల 10 నుంచి విత్తన కందుల కోసం రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని శింగనమల, ఈస్ట్ నరసాపురం, సలకంచెర్వు, రాచేపల్లి, తరిమెల, కల్లుమడి, వెస్ట్ నరసాపురం, ఆకులేడు, లోలూరు, చక్రాయిపేట, పెరవలి, జూలకాల్వ ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. ఇప్పటికే రైతులకు 2 వేల క్వింటాళ్ల కే-6 విత్తన వేరుశనగ పంపిణీ చేశామన్నారు. ఆర్బీకేల్లో లేపాక్షి విత్తన వేరుశనగ స్టాక్ ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సబ్సిడీపై ఎరువులు,కందులు

గార్లదిన్నె: ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై కందులు, పచ్చి రొట్ట ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. శుక్రవారం ఏఓ మాట్లాడుతూ 30 శాతం సబ్సిడీపై ఎల్ఆర్‌జీ 52 రకం కందులు, వరిలో భూసారం పెంచడం కోసం 50 శాతం సబ్సిడీతో జీలుగ, జనుము, పచ్చి రొట్ట ఎరువులు పంపిణీ చేస్తామన్నారు. అలాగే కందులు, పచ్చి రొట్ట ఎరువులు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నంబర్ తీసుకుని రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు.

టీటీడీ చైర్మన్ పదవి బీసీలకే ఇవ్వాలి

- బీసీ సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్



గుంతకల్లు: తిరుపతి తిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవి బీసీలకు కేటాయించేలా చంద్రబాబు నిర్ణయం తీసుకోవాలని బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టో ప్రకారం చంద్రబాబు సీఎం అయిన వెంటనే తొలి సంతకం బీసీలకు ఇచ్చిన హామీలపైనే చేయాలని కోరారు. 50 ఏళ్లకే నెలకు రూ.4వేల పింఛన్, చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీసీలకు సబ్‌ప్లాన్ కింద ఐదేళ్లలో రూ.1.50 లక్షలు ఖర్చు చేస్తామని, ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామని హామీలిచ్చారని గుర్తు చేశారు.

చిగురిస్తున్న అన్నదాత ఆశలు

- ఊరిస్తున్న ముంగారు వర్షాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు



పెద్దవడుగూరు మండలం దిమ్మగుడిలో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు



గుత్తి అనంతపురం వద్ద వర్షపు నీటితో కళకళలాడుతున్న కుంట

పెద్దవడుగూరు: ముంగారు వర్షాలు రైతులను ఊరిస్తున్నాయి. జిల్లాలో వారం రోజులు గా కురుస్తున్న వర్షాలతో నీటి కుంటలు, చెక్ డ్యాములు కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ సాగు కోసం కావాల్సిన విత్తనం కొనుగోలు చేసుకుంటున్నారు. వేరుశనగ, పత్తి, ఆముదం, జొన్న, సజ్జ , కంది, అలసందలు, ఉలవలు తదితర పంటలను సాగు చేయడం వలన ఎంతో లాభం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పెద్దవడుగూరు మండలంలోని చిన్నవడుగూరు, దిమ్మగుడి, చిత్రచేడు, పి.కొట్టాలపల్లి తదితర గ్రామాల్లో పలువురు రైతులు తొలకరి వర్షాలకే పత్తి విత్తనం సాగు చేస్తున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలోని పెద్దవడుగూరు మండలంలో 7,254 హెక్టార్లల్లో పంటల సాగు విస్తీర్ణం ఉంది. పత్తి, మిరప సాగుపై రైతులు అధికంగా మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది మిరప రైతులు చాలా వరకూ దిగుబడి రాక తీవ్ర నష్టాలపాలయ్యారు. పత్తి రైతులకు వచ్చిన పంట దిగుబడి కూలీలకే సరిపోయిందని కొంత మంది రైతులు అంటున్నారు.

పెరగనున్న సాగు విస్తీర్ణం

తాడిపత్రి మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 4,200 హెక్టార్లుగా, పెద్దపప్పూరు మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 3,500 హెక్టార్లుగా, యాడికి మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 14,000 హెక్టార్లుగా వ్యవసాయాధికారులు తెలిపారు .పెద్దపప్పూరు మండలంలోని చాలా వరకూ రైతులు హార్టికల్చర్ వైపు మొగ్గ చూపినా అంతర పంటలుగా మొక్కజొన్న, పత్తి, వేరుశనగ సాగు చేస్తున్నారు. యాడికి మండలంలోనూ రైతులు గత ఏడాది కంటే ఈ ఏడాది అధికంగా పంటలను సాగు చేయడం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం కౌలు చేసే రైతులకు కష్టాలు అధికమయ్యాయి. గతంలో పంట దిగుబడిని విక్రయించిన తరువాత రైతులకు కౌలు ఇచ్చేవారు. కాని ఈ సంవత్సరం కౌలు ముందుగానే ఇవ్వాలని యజమానులు అంటుండటంతో కౌలు రైతులు ఖంగుతింటున్నారు.

90 శాతం సబ్సిడీతో విత్తనమివ్వాలి



పంటలను సాగు చేయడం కోసం రైతులు పడుతున్న కష్టాలు అన్ని ఇన్నీ కాదు. గత ఏడాది వచ్చిన అరకొర పంట కూలీలు, పెట్టుబడికి కూడా రాలేదు. ఈ సంవత్సరం వర్షాలు ఊరిస్తున్నాయి. దీంతో రైతులకు మరోసారి పంటలను సాగు చేయాలనే ఆశ చిగురించింది. రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనం పంపిణీ చేయాలి.

– వెంకట్రాముడుయాదవ్,
రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

సాగుకు సిద్ధం



ప్రస్తుతం ఖరీఫ్ సాగు చెయ్యడానికి అష్ట కష్టాలు పడుతూ రైతులు సిద్ధం అవుతున్నాం. లక్షల రూపాయలు అప్పుగా తెచ్చుకుని విత్తనం కొనుగోలు చేసి పంటలు సాగు చేస్తున్నాం. ఇప్పటికే పొలాలు దుక్కి చేసుకుని, చదును చేసుకున్నాం. దేవుడి కరుణ ఉండి పంటలు బాగా పండాలని కోరుకుంటున్నాం.

– అవుకు నాగయ్య, రైతు, యాడికి

రైతులకు అందుబాటులో ఉంటాం



రైతులు పంటలు సాగు చేయడానికి అవసరమైన సలహాలు సూచనలు అందించడానికి వ్యవసాయి సిబ్బంది అందుబాటులో ఉంటారు. పంటలకు ఎలాంటి తెగుళ్లు వచ్చినా వాటి నుంచి పంటను రక్షించడానికి సహాయం చేస్తాం. పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు అండగా ఉంటాం. ప్రభుత్వం నుంచి వచ్చిన సబ్సిడీ ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తాం.

– మల్లీశ్వరి, ఏఓ పెద్దవడుగూరు మండలం

ఆముదం పంట సాగు లాభదాయకం



కొత్త రకం ఆముదం విత్తనాన్ని ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: ఆముదం పంట సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఐఐఓఆర్ పర్యవేక్షణలో ఉరవకొండకు చెందిన రాయలసీమ అగ్రి ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ నూతనంగా అభివృద్ధి చేయబడిన ఐసీహెచ్-5 ఆముదం రకం నూతన వంగడాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఆయనతోపాటు, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరి హాజరయ్యారు. వారు మాట్లాడారు. కరువు జిల్లాకు వరప్రదాయిని ఐసీహెచ్-5 ఆముదం రకం అన్నారు. వర్షాబావ పరిస్థితులను సమర్థవంతంగా తట్టుకు అధిక దిగుబడులు ఇవ్వడం ద్వారా రైతులకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మంజునాథ్, పవన్‌కుమార్‌రెడ్డి, రాయలసీమ అగ్రి ప్రొడ్యూసర్ కమిటీ లిమిటెడ్ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్లు యోగీశ్వరరెడ్డి, కె. శ్రీధర్‌రెడ్డి, ఆదర్శరైతు భాస్కర్‌రెడి పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కోవద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ వెంకట్రామిరెడ్డి

గుత్తి రూరల్: గ్రామాల్లో చిన్నపాటి విషయాలకు ఘర్షణలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కొవద్దని సీఐ వెంకట్రామిరెడ్డి సూచించారు. మండలంలోని టి.కొత్తపల్లిలో శుక్రవారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ నెల 4న కౌంటింగ్ అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గాలకు చెందిన వారు ఘర్షణ పడి ఏడుగురు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో సీఐ వెంకట్రామిరెడ్డి, పామిడి సీఐ రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ భారతితో కలసి గ్రామంలో సభ నిర్వహించారు. సీఐ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యాయని, ఇక రాజకీయాలు వదిలి ఎవరి పనుల్లో వారు నిమగ్నమవ్వాలన్నారు. అందరూ కలసిమెలసి ప్రశాంతంగా ఉండాలన్నారు. ఏ ఒక్కరూ తప్పు చేసినా గ్రామానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. గ్రామంలో ప్రశాంతతకు భంగం కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లలిత, వీఆర్ఓ ధన, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

పుట్లూరు: చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ సుబ్రమణ్యం హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని గరుగుచింతలపల్లి, చిన్నమల్లేపల్లి, కోమటికుంట్ల గ్రామాల్లో పర్యటించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఆయా గ్రామాల్లో పరిస్థితులపై ఆయన ఆరా తీశారు. వివాదాలకు దూరంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు.

స్వల్పకాలిక కోర్సులతో ఉపాధి అవకాశాలు



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: పీఎంకేవీవై రూపొందించిన స్వల్పకాలిక కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఇనిస్టిట్యూట్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఐఎంసీ) కమిటీ సభ్యుడు శేషాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు పూర్తి చేసుకున్న వారికి శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. శేషాంజనేయులు మాట్లాడుతూ.. సాధారణ డిగ్రీలతో పాటు స్వల్పకాలిక కోర్సుల ద్వారా వచ్చే సర్టిఫికెట్లను అదనపు అర్హతగా భావిస్తారన్నారు. తద్వారా పారిశ్రామిక రంగం, సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మార్కెట్‌కు అనుగుణంగా అవసరమయ్యే కోర్సులను ఎంపిక చేసుకుని జీవితానికి మెరుగులు దిద్దుకోవాలన్నారు. మరో సభ్యుడు నీలకంఠారెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఉత్పత్తి రంగానికి మంచి డిమాండ్ ఉంటుందన్నారు. అందుకు తగిన నాణ్యత, నైపుణ్యాలను సొంతం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ.. పీఎంకేవీవై కింద ఇప్పటిదాకా 210 మంది అభ్యర్థులకు స్వల్పకాలిక కోర్సుల్లో అవకాశం కల్పించామన్నారు. ప్రస్తుతం 64 మందికి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి జగన్, ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, కోర్సు కో-ఆర్డినేటర్ అపర్ణ పాల్గొన్నారు.

11న అశ్వత్థంలో బియ్యం, బేడల వేలం

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో మాఘమాసం తిరునాల సందర్భంగా భక్తులు స్వామికి సమర్పించిన బియ్యం, బేడలను ఈ నెల 11న వేలం వేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

యాడికి: ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం రాత్రి తోటలో నిద్రిస్తున్న మండలంలోని వెంగన్నపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దొడ్డెప్పపై టీడీపీకి చెందిన వెంకట్రామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి దాడి చేశారు. శుక్రవారం బాధిత దొడ్డెప్ప ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ ప్రశాంతంగా ఉండాలని పోలీసులు సూచించారు. అనవసరంగా ఎవరూ గొడవలకు పాల్పడవద్దన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు



గుంతకల్లుటౌన్: ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



యల్లనూరు: విద్యార్థికి బహుమతులందజేస్తున్న గ్రంథాలయాధికారి ప్రకాష్‌రెడ్డి



గుత్తి: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: స్థానిక వన్‌టౌన్ పీఎస్ వద్ద ఉన్న ప్రభుత్వ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి సెలవుల్లో విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ శిబిరాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి కమ్మన్న మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు పుస్తకపఠనంపై ఆసక్తి పెంపొందించుకోవడం వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరమన్నారు. చిత్రలేఖనం, పుస్తకపఠనం, డ్యాన్స్, ఇండోర్ గేమ్స్‌పై విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చిన చిత్రకారుడు శ్రీధరన్, ఉపాధ్యాయులు సరస్వతి, రఘుకుమార్, సిరాజుద్దీన్ తదితరులను గ్రంథాలయ సిబ్బంది సన్మానించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సహ గ్రంథాలయాధికారిణి హేమలత, రాము తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో గత 21 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. చివరి రోజు వివిధ అంశాలు, పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు, పాఠకులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రామాంజనేయులు, రిటైర్డ్ గ్రంథాలయాధికారి ఏసీ సుబ్బన్న సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

యల్లనూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని లైబ్రరీయన్ ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిర ముగింపు కార్యక్రమమంలో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. క్యారంబోర్డులో మొదటి బహుమతి గురుదేవ్, చెస్‌లో ప్రణీత్, డ్రాయింగ్‌లో పెద్దరాయుడు, మ్యూజికల్ చైర్స్‌లో భావనకు లైబ్రరియన్‌తో కలసి ఉపాధ్యాయుడు మురళి బహుమతులందజేశారు.



పెద్దవడుగూరు గ్రంథాలయంలో విజేతలకు బహుమతులందజేస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: విద్యార్థులకు పుస్తక పఠనం చాలా అవసరమని ఎంఈఓ రాముడు, జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌బాబు సూచించారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తకాలు చదవడం , చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్స్, చెస్ లాంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి శిరీష ఆధ్వర్యంలో గత 21 రోజుల నుంచి గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. చివరి రోజు కథలు చెప్పడం, పుస్తకాలు చదవడం, చిత్రలేఖనం, మ్యూజికల్స్ చైర్స్, స్కిప్పింగ్, చెస్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ మానస, పాఠకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సీఎస్ఐ చర్చిలో విరామ బైబిల్ పాఠశాల పిల్లల సాంస్కృతిక కార్యక్రమాల దృశ్యం

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో నిర్వహిస్తున్న విరామ బైబిల్ పాఠశాలకు సంబంధించి పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం రెండోరోజు పాస్టరమ్మ సువర్ణమ్మ విశ్వమోహన్ , సండే స్కూల్ టీచర్ ఎస్ ప్రిస్కిల్లా రత్నరాజు ఆధ్వర్యంలో విరామ బైబిల్ స్కూల్ టీచర్లు ఏసుకాంత్, డేవిడ్ ప్రిన్స్ సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలు ఆకర్షణగా నిలిచాయి. ఈసందర్భంగా చిన్నారులు ఆలపించిన దైవ సంకీర్తనాలాపనలు చూపరులను ఆకట్టుకున్నాయి, నృత్య ప్రదర్శనలు రంజింపజేశాయి. కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, బుజ్జిబాబు, అబ్రహాం, అల్లీపీరా, బాలు, ప్రసాద్, రజని, వాణి, మహిమ, రేచెల్, భారతి, ప్రియదర్శిని, పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా చండ్ర రాజేశ్వరరావు జయంతి



రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ నాయకుడు చండ్రరాజేశ్వరరావు 110వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామాంజనేయులు, కుళ్లాయప్ప, ఈశ్వరయ్య, మురళి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతుల ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఈ నెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని, 13వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పాఠశాలలో 8, 9వ తరగతులకు సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం బోధన ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో ఉన్న కోళ్ల ఫారం సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్యాపిలికి చెందిన రామాంజనేయులు, అరవింద్ బైక్‌లో గుత్తికి వచ్చారు. పని ముగించుకుని తిరిగి ప్యాపిలికి వెళుతుండగా బైక్ అదుపు తప్ప బోల్తా పడింది. ఘటనలో గాయపడిన రామాంజనేయులు, అరవింద్ లను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవంపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

యాడికి: దోమలు కుట్టకుండా ప్రతిఒక్కరూ రాత్రిపూట దోమతెరలను వాడితే మలేరియా రాదని యాడికి పీహెచ్‌సీ వైద్యులు శ్రీరామ్ కుమార్, పరమేశ్వర తెలిపారు. శుక్రవారం మండలంలోని వేములపాడులో మలేరియాకురేకంగా వారు వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ ఇంటి ముందు నీరు నిల్వ ఉండకుండా, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా జూన్ 1నుంచి 30 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు వైద్య సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసులు, రాంప్రసాద్ గౌడ్ తదితరుల పాల్గొన్నారు.